
గ్రామస్తులకు విరాళం అందజేస్తున్న కుమ్మరిస్వామి

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

కులకచర్ల, జూన్ 15 : మండల పరిధిలోని చెరువుముందలితండా(ఏ)లో ఉన్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి శుక్రవారం సామాజికవేత్త కుమ్మరి స్వామి రూ.25వేల విరాళం గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి తన వంతు సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తుడు రవిలాల్, స్వామి అన్న సైన్యం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

వికారాబాద్, జూన్ 15 : మండల పరిధిలోని ముస్లింలు బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని వికారాబాద్ సీఐ నాగరాజు తెలిపారు. శనివారం వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బక్రీద్ సందర్భంగా అందరూ పోలీస్ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. పండుగలో ఉపయోగించే జంతువులకు కచ్చితంగా ఫిట్ ఫర్ స్లాటరింగ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని సూచించారు. ఆవులు, లేగ దూడలను ఉపయోగించరాదని హెచ్చరించారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

జీరో బిల్లు కోసం వివరాలు ఇవ్వాలి

పెద్దేముల్, జూన్ 15 : గృహజ్యోతి పథకం అమలు కోసం ప్రజలు తమ పూర్తి వివరాలు ఇవ్వాలని తాండూరు డీఈ భానుప్రసాద్, ఏడీ ఆదినారాయణ కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజాపాలన సహాయ కేంద్రాల్లో వివరాలను అందించి నమోదు చేయించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గృహజ్యోతి పథకానికి సంబంధించి జీరో కరెంటు బిల్లులు రాని వారు గ్రామ పంచాయతీలకు చెందిన వారు మండల పరిషత్ కార్యాలయాల్లో, మున్సిపాలిటీల పరిధిలోని వారు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సహాయ కేంద్రంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి లబ్ధిదారులు గత ప్రజాపాలన దరఖాస్తు రసీదు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కరెంట్ బిల్లు, గ్యాస్ బుక్ జిరాక్స్‌లతో పాటు కుటుంబ యజమాని లేదా కుటుంబ సభ్యుడు మొబైల్ ఫోన్‌తో రావాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు నమోదు చేస్తే ఓటీపీ నంబర్ వస్తుందన్నారు. ఆ ఓటీపీ నంబర్ ద్వారానే దరఖాస్తు ఓపెన్ అవుతుందని తెలిపారు.

జియోలైఫ్ విక్రయాలను నిలిపివేయాలి..

కొడంగల్, జూన్ 15 : ఫర్టిలైజర్‌కు సంబంధించిన జియోలైఫ్ మందుల విక్రయాలను నిషేధిస్తూ వ్యవసాయాధికారులు శనివారం నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ శంకర్‌రాథోడ్ మాట్లాడుతూ.. ఇటీవల వరి విత్తనాలతో పాటు జియోలైఫ్ మందుల వాడకంతో రైతులు తీవ్రంగా నష్టపోవడంతో ఆందోళన చేపట్టి ఫిర్యాదు చేశారని తెలిపారు. నాసిరకం వరి విత్తనాలకు సంబంధించి జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, జియోలైఫ్ ఉత్పత్తుల్లో కొన్నింటి విక్రయాలను నిలిపివేస్తూ నోటీసులు జారీ చేశామన్నారు. తదిపరి విచారణ అనంతరం తగు చర్యలు చేపట్టనున్నట్లు ఏడీఏ పేర్కొన్నారు. రైతులకు నష్టం కలిగించే విత్తనాలు, ఫర్టిలైజర్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు

కొడంగల్, జూన్ 15 : ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల అమలులో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ప్రత్యేకంగా ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్యారెంటీల అమలులో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బందులకు గురికాకుండా సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు దారులకు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హులకు పథకాలు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మేనల్లుడే మట్టుబెట్టాడు

- భూమి ఇవ్వలేదన్న కక్షతో ఘాతుకం
- తంగడిపల్లి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీఐ లక్ష్మారెడ్డి

కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ లక్ష్మారెడ్డి

చేవెళ్ల రూరల్, జూన్ 15 : తంగడిపల్లిలో జరిగిన వ్యక్తి హత్య కేసును పోలీసులు ఛేదించారు. దీనికి సంబంధించిన వివరాలను శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ లక్ష్మారెడ్డి వెల్లడించారు. చేవెళ్ల మండలం తంగడిపల్లికి చెందిన రుల్లాఖాన్ (58) భార్య జాకియా బేగం, ముగ్గురు పిల్లలతో కలిసి 15 సంవత్సరాలుగా నగరంలోని మలక్‌పేటలో నివాసముంటున్నారు. గ్రామంలో వ్యవసాయ పొలం ఉండడంతో అప్పుడప్పుడూ ఇక్కడకు వస్తుండేవారు. వ్యవసాయ పనుల నిమిత్తం రుల్లాఖాన్ నెల రోజులుగా స్వగ్రామంలోనే ఒంటరిగా ఉంటున్నాడు. అతని మేనల్లుడు ఖాజా పాషా గతంలో తన ఇద్దరు మామలు రుల్లాఖాన్, అన్వర్ పాషాలను తనకు ఇద్దరూ కొంత భూమిని కేటాయించాలని కోరాడు. పెద్ద మామ అన్వర్ పాషా భూమికి బదులుగా రూ.14 లక్షలు ఇస్తానని అంగీకరించగా, చిన్న మామ రుల్లాఖాన్ మాత్రం రూ.లక్ష లేదా 2 లక్షలు ఇస్తానని తెలిపాడు. దీంతో రుల్లాఖాన్‌పై కక్ష పెంచుకున్న ఖాజాపాషా హత్య చేయాలని భావించాడు. రుల్లాఖాన్ తంగడిపల్లిలో ఒంటరిగా ఉంటున్నాడని తెలుసుకున్న అతను ఓల్డ్‌సిటీకి చెందిన తన స్నేహితులు షేక్ ముస్తఫా, అఫ్సర్‌తో కలిసి గురువారం రాత్రి 11 గంటలకు తన మామ ఇంటికి వచ్చాడు. తన స్నేహితులు, మామతో కలిసి మద్యం సేవించారు. రాత్రి 2 గంటలకు ఖాజా పాషా తన మామ రుల్లాఖాన్‌తో గొడవ పడి వెంట తెచ్చుకున్న కత్తితో ఇద్దరు స్నేహితుల సాయంతో అతి కిరాతకంగా దాడి చేసి హత్య చేశాడు. ఇది గమనించిన గ్రామస్తులు వారిని వెంబడించడంతో స్కూటీని అక్కడే వదిలి పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చే నిందితులను రిమాండ్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో ఎస్సై ప్రదీప్ కుమార్, కానిస్టేబుళ్లు రవి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందిస్తాం

- దోమ ఎంపీపీ అనసూయ
- మండల సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై చర్చ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనసూయ

దోమ, జూన్ 15 : ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎంపీపీ అనసూయ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఆయా శాఖలకు సంబంధించి అభివృద్ధి, సంక్షేమంతో పాటు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజల సాధారణ సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులతో పాటు ప్రత్యేక అధికారులు దృష్టి సారించి మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

రోడ్ల పనులు ప్రారంభించి.. వదిలేశారు

వైస్ ఎంపీపీ మల్లేశం మాట్లాడుతూ.. పలు గ్రామాల్లో రోడ్ల పనులను ప్రారంభించి ఇప్పటికీ పూర్తి చేయలేక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయా శాఖల అధికారులను ప్రశ్నించారు. ఆ పనులకు సంబందించిన టెండర్లు రద్దయ్యాయని వారు పేర్కొన్నారు. పీఎం కిసాన్ డబ్బులు చాలా మంది రైతులకు రావడం లేదని ఆయన ఏవోను అడగగా 2019 తర్వాత పాసు బుక్కులు వచ్చిన వారికి రావడం లేదని ఆయన బదులిచ్చారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతులు 95 శాతం పూర్తయ్యాయని ఎంఈవో హరిశ్చందర్ తెలిపారు. గ్రామాల్లో నీటి సరఫరా కోసం ఎస్‌డీఎఫ్ ఫండ్ కింద మండలానికి రూ.25లక్షలు, గ్రామ పంచాయతీల నిర్వహణకు రూ.15 లక్షలు మంజూరయ్యాయని మిషన్ భగీరథ ఏఈ పేర్కొన్నారు.

కార్మికులకు వేతనాలు ఇవ్వలేక ఇబ్బందులు

గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్నామని, ఈ విషయాన్ని జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకొచ్చి నిధులు మంజూరయ్యేలా కృషి చేయాలని ఎంపీవో సోమలింగం సభ దృష్టికి తీసుకొచ్చారు. సభలో బొంపల్లికి చెందిన మాజీ సర్పంచ్ సురేశ్, ఎంపీటీసీ రాములు మధ్య వాగ్వాదం జరిగింది. ముగ్గురు పిల్లలు ఉన్న ఎంపీటీసీని సమావేశానికి ఎందుకు అనుమతిచ్చారని మాజీ సర్పంచ్ సురేశ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై ఎంపీపీ, వైస్ ఎంపీపీ జోక్యం చేసుకొని ఎన్నికల కమిషన్, కోర్టు ద్వారా తేల్చుకోవాలని సూచించారు. అనవసర విషయాలతో ఇక్కడ రాద్ధాంతం చేయరాదని సురేశ్‌ను సభ నుంచి బయటికి పంపారు. సమావేశంలో ఎంపీడీవో మహేశ్‌బాబు, తహసీల్దార్ పురుషోత్తం, కోఆప్షన్ సభ్యుడు ఖాజా పాషా, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు

రాజకీయ కోణంలో ఎదుర్కోలేకనే ఎంపీటీసీ రాములుపై మాజీ సర్పంచ్ సురేశ్ లేని పోని ఆరోపణలు చేస్తున్నారని వైస్ ఎంపీపీ మల్లేశం, ఎంపీటీసీ రాములు పేర్కొన్నారు. దోమ మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ముగురు పిల్లలు అనే విషయం 2013 నుంచి 2016 వరకు కోర్టులో కేసు కొనసాగిందన్నారు. రాములుకు ముగ్గురు పిల్లల విషయంలో కోర్టు అనుకూలమై తీర్పు ఇచ్చిందన్నారు. లేని పోని ఆరోపణలు చేయడం సరికాదని హెచ్చరించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఖాజా పాషా, అంజి తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి


బొంరాస్‌పేట : విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు

కులకచర్ల :ముజాహిద్‌పూర్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న హెచ్ఎం సంతోశ్‌కుమార్

బొంరాస్‌పేట, జూన్ 15 : బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, మాజీ సర్పంచ్ అంజిల్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ అనంతయ్య తెలిపారు. మండల పరిధిలోని ఏర్పుమళ్ల యూపీఎస్‌లో శనివారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నదని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం నీలకంఠం గ్రామస్థులు పాల్గొన్నారు.

సందనిగడ్డ పాఠశాలలో అక్షరాభ్యాసం

కులకచర్ల : మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలోని సందనిగడ్డ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్నప్పటి నుంచే విద్య పట్ల ఆసక్తిని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సుమ, చైర్‌పర్సన్ సత్యమ్మ, వెంకటేశ్వరి, చిన్నారుల తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జనుము విత్తనాలు

బొంరాస్‌పేట, జూన్ 15 : మండల పరిధిలోని తుంకిమెట్ల ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో పచ్చిరొట్ట ఎరువైన జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. 50 శాతం రాయితీపై 40 కిలోల జనుము విత్తనాల బస్తాకు రూ.1448 చెల్లించాలని తెలిపారు. విత్తనాలు అవసరం ఉన్న రైతులు తీసుకోవాలని ఆమె కోరారు. మండల పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పరిగి, జూన్ 15 : మండల పరిధిలోని జాఫర్‌పల్లిలోని మాడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 8వ తరగతి వరకు హిందీ బోధించేందుకు హిందీ పండిట్ (ఎంఏ బీఈడీ), సంబంధిత అర్హత కలిగిన వారు అర్హులని, 9 నుంచి 12వ తరగతి వరకు వృక్షశాస్త్రం బోధించడానికి బీఈడీతోపాటు సంబంధిత సబ్జెక్టులో పీజీ పూర్తి చేసి ఉండాలన్నారు. పీజీటీ పోస్టులు ఇంగ్లీష్, ఫిజిక్స్(భౌతిక శాస్త్రం), కామర్స్, సివిక్స్, జువాలజీ సబ్జెక్టుల్లో బీఈడీతోపాటు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ అర్హత కలిగి ఉండాలని సూచించారు. ఈనెల 18వరకు దరఖాస్తులు అందజేయాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు సంబంధిత పాఠశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని ఆయన సూచించారు.

బ్యాంకు పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఆమనగల్లు, జూన్ 15 : డిజిటల్ బ్యాంకింగ్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆమనగల్లు శాఖ ఫీల్డ్ ఆఫీసర్స్ జగన్‌మోహన్, పండరినాథ్ తెలిపారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లిలో బ్యాంక్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ ఆఫీసర్లు డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, బ్యాంకులు అందిస్తున్న రుణాలు, బీమా, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులకు బ్యాంక్ ఓటీపీలు తెలియపరచరాదన్నారు. తమ బ్యాంకులో ఖాతాదారులందరూ తక్కువ ప్రీమియంతో ఇన్యూరెన్స్‌లు అందుబాటులో ఉన్నాయని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ వివాదం.. దాయాదుల మధ్య ఘర్షణ

దోమ, జూన్ 15 : భూవివాదంలో పలువురు గాయపడిన ఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఎస్సై ఆనంద్‌కుమార్, బాధితులు తెలిపిన వివరాలు.. నారాయణపేట జిల్లా కోస్గి మండలంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన బుసకోటి రామకృష్ణకు దాయాదులైన పిట్ల కృష్ణయ్య, వెంకట్‌రాములు, సాయిలు, శివలకు దోమ మండల పరిధిలోని గుండాల గ్రామ రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 73లో వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమి వివాదం విషయమై ఘర్షణ చెలరేగింది. సర్వే నంబర్ 73లో కొంత భాగం భూమి తమకు వస్తుందని దాయాదులు కోరినా.. సదరు రైతు రామకృష్ణ అంగీకరించకపోవడంతో వారి మధ్య ఘర్షణ చెలరేగి కర్రలు, గొడ్డళ్లతో దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో రామకృష్ణకు తీవ్ర గాయాలు కాగా పులువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఇరువురు వ్యక్తులు దోమ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మంచాలలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

దంచికొట్టిన వాన

మంచాల, జూన్ 15 : మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి ఎండవేడిమికి ఉక్కిరి బిక్కిరి అయిన జనాలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

పెద్దతండాలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో సర్దార్ నాయక్

ఆమనగల్లు, జూన్ 15 : ఉపాధ్యాయులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంఈవో సర్దార్‌నాయక్ హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని కోనాపూర్, పెద్దతండా, గేట్ తండాలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేశారా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. రాంనుంతలలోని పాఠశాలను సందర్శించగా ఉపాధ్యాయురాలు స్వాతి సమయానికి రాకపోవడంతో ఆమెకు మెమో జారీ చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో జరిగిన బాలికల సాధికారత కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీఈడీ, డీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

షాబాద్, జూన్ 15: ఉమ్మడి జిల్లాలో స్థానిక బీఈడీ, డీఈడీ చేసిన నిరుద్యోగులు, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రంగారెడ్డిజిల్లాకు సంబంధించి 400లకు పైగా ఉపాధ్యాయ ఖాళీల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇతర జిల్లాల స్థానికేతర ఉపాధ్యాయులను భర్తీ చేశారని తెలిపారు. వారందరినీ వెనక్కి పంపి ఆ ఖాళీలను రంగారెడ్డిజిల్లాకు సంబంధించిన వారితో భర్తీ చేయాలన్నారు. డీఎస్సీలో పోస్టుల సంఖ్య పెంచి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రతాప్, అశోక్‌గౌడ్, రాములు, యాదిశ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
REAL ESTATE
★హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, కోదాడ పరిసర ప్రాంతాలలో స్థలాలు, పొలాలు, ప్లాట్స్ అమ్మాలన్నా, కొనాలన్నా & డెవలప్ చేసి ఇవ్వాలన్నా సంప్ర: 9133915599, 7995912999.
NT-16-All
PLOT FOR SALE
★Corel Draw Photo Shop Designer M/F Sal: 20K, Office Clerk Female Calculation & Receptionist Sal: 15K, 2 No's Marketing Executives (Male) Sal: 18K. Near RTC X-Road, Pillar No. 34 & 35. 9849003504.
NT-97639-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

PUBLIC NOTICE
General Public hereby call upon you that my clients **Veena Vilas Gala W/o. Vilas Gala and Heena Gala Tarun W/o. Tarun Kumar Gala R/o D.No. 1-8-726/47/17, Achaiah Nagar, Padma Colony, Nallakunta, Hyd-500044,** intends to purchase the property of Farm Site No. 63, in MILLINIUM SAPPHIRE, Admeasuring 348 Sq.yds or 291.21 Sq.mtrs, in Sy.No. 383, situated at Near Rallaguda, Shamshabad village and Gram Panchayath, Shamshabad Mandal, Ranga Reddy Dist from its owners **1) Sri. Pratap V Khanapurkar** S/o V V Khanapurkar, **2) Sri. Gove Dayanand** S/o. G Venkat Rao, R/o H.No. 6-264/3/4/6, Sri Venkateshwara Colony, Suhitra, Chintal, Hyderabad, for valid sale consideration amount, this is to inform the general public and all concern if anybody having objections by persons, Financial Institutions etc., if entered into any prior Agreements, Deed or Deeds with the above said persons, the objection will be raised within Fifteen days (15 days) form the date of publish of this Notice with strict proof of documentary evidence and contact in the below said address, otherwise my clients will pay the balance sale consideration and complete the Registration formalities. Whoever wants to challenge this public notice shall challenge in writing within Fifteen (15) days from the date of this Public Notice and all the correspondence after the prescribed period shall not be considered and treated as null and void.
Sd/- **POTHAMSHETTY NAGESH, M. RAJITHA**
Advocates
H.No. 3-5-385, Flat No. G-1, Omsree RK Enclave, Vittalwadi, Narayanaguda, Hyderabad-29. **Cell: 9885317896, 9849521040**
Place: Hyderabad.
Date: 15-06-2024.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి
తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962